నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 10 జూన్ 2025 | RANGAREDDY



తమకు గత మూడు నెలలుగా స్టైఫండ్ ఇవ్వడం లేదని సోమవారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులు
- చేవెళ్ల టౌన్, జూన్ 9

భూములివ్వం..

రైతుల నిరసనలతో ముందుకు సాగని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించాలనుకుంటున్న ఫోర్త్‌సిటీకి అడుగడుగునా అడ్డంకులెదురవుతున్నాయి. ఫోర్త్ సిటీ నిర్మాణంలో భాగంగా ముందుగా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీచేసింది. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డు వరకు సుమారు 42 కి.మీ. దూరం 330 ఫీట్ల వెడల్పుతో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని కోసం మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల భూసేకరణ జరపాల్సి ఉంది. ఇందులోభాగంగా ప్రభుత్వం అవసరమైన భూములపై సర్వే నిర్వహించింది. కాని, బాధిత రైతులు సర్వేను అడుగడుగునా అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసు బలగాల సహకారంతో రెవెన్యూ అధికారులు హద్దులను ఏర్పాటుచేశారు. ఫేస్-1లో 18.5, ఫేస్-2లో 22 కి.మీ. రోడ్డును ఏర్పాటు చేయనున్నారు. ఫేస్-1లో 440, ఫేస్-2లో 545 ఎకరాల వరకు సేకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. భూసేకరణలో భాగంగా రైతులు అడుగడుగునా అడ్డు తగులుతుండటంతో భూసేకరణకు అనేక అడ్డంకులెదురయ్యాయి. ఒకానొక దశలో రాత్రి సమయాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా భూముల వివరాలను సేకరిచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు భూసేకరణను నిలిపివేయాలంటూ కోర్టును కూడా ఆశ్రయించారు.

- రంగారెడ్డి, జూన్ 9 (నమస్తే తెలంగాణ)

మీర్‌ఖాన్‌పేట్‌లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు రైతులతో సమావేశం నిర్వహిస్తున్న భూసేకరణ అధికారి

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం అధికారులు బలవంతంగా పోలీసుల సహకారంతో హద్దురాళ్లు ఏర్పాటుచేశారు. కాని, రైతుల అంగీకారం ఉంటేనే భూసేకరణ జరపాలని నిబంధన ఉండటంతో రైతులు గ్రామాలవారీగా బహిరంగ విచారణ జరుపుతున్నారు. జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామాలవారీగా బహిరంగ విచారణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని కోరుతున్నారు. ఇప్పటికే మహేశ్వరం మండలంలోని కొంగరకుర్దు, ఇబ్రహీంపట్నం మండలంలోని కొంగరకలాన్, కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్ పేట్, లేమూర్ తదితర గ్రామాల్లో బహిరంగ విచారణ కార్యక్రమాలను నిర్వహించారు. భూములిచ్చేది లేదని.. దీంతో తమకు ఎలాంటి ఉపయోగం లేదని రైతులు తెగేసి చెబుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాలను బహిష్కరించారు.

భూమికి భూమి ఇవ్వాలి

మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో సోమవారం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు నేతృత్వంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భూములివ్వడానికి ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని రైతులను కోరారు. మీర్‌ఖాన్‌పేట్‌లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో సుమారు వంద ఎకరాల వరకు భూమిని రైతులు కోల్పోతున్నారు. ఈ భూమి దేవాదాయ భూమి అయినప్పటికీ తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామన్నారు. ఈ భూమి ఇస్తే తాము ఉపాధి కోల్పోతామని, తమ మనుగడే ప్రశ్నార్థకంగా ఉంటుందని తెలిపారు. భూమికి భూమి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

- సర్వే ప్రక్రియ ప్రారంభమై ఏడాది కావస్తున్నా పూర్తికాని భూసేకరణ
- సర్వేను అడుగడుగునా అడ్డుకున్న అన్నదాతలు
- పోలీసుల సహకారంతో హద్దురాళ్లు ఏర్పాటు చేసిన అధికారులు
- గ్రామాలవారీగా అధికారులు నిర్వహిస్తున్న బహిరంగ విచారణకు సహకరించని రైతులు

అధికారులకు చుక్కలు చూపిస్తున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు భూసేకరణ చేపడుతున్న అధికారులకు రైతులు చుక్కలు చూపిస్తున్నారు. భూములను గుర్తించే క్రమం నుంచి రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. తమ పంట భూములను తీసుకోవద్దంటూ రైతులు భూసేకరణ అధికారులకు మొరపెట్టుకుని ఒకానొక దశలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యలకు కూడా ప్రయత్నించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమై ఏడాది కావస్తున్నప్పటికీ భూసేకరణ ప్రక్రియ కూడా పూర్తికాలేదు. దీంతో నాలుగో నగరం ఆరంభంలోనే అడ్డంకులెదురవుతున్నాయి.

గుట్టను తవ్వుతున్న ఇటాచీ యంత్రం

గుట్టను తవ్వేస్తున్నారు..!

- భారీ వాహనాలతో మొరం తరలింపు
- దారి కోసం పొలం హద్దులూ తొలగింపు

బషీరాబాద్, జూన్ 9 : మండల పరిధిలోని నీళ్లపల్లి గ్రామ శివారులోని ఓ పొలానికి ఆనుకొని ఉన్న ఓ పెద్ద గుట్టను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కాంట్రాక్టర్ ఇటాచీ యంత్రంతో గుట్టపై ఉన్న చెట్లను తొలిగించి భారీ వాహనాల్లో మొరాన్ని తరలిస్తున్నాడని గ్రామస్తులు వాపోయారు. కొడంగల్ మండలంలోని రుద్రారం రోడ్డు పనులకు రెండు రోజులుగా మొరం తరలిస్తున్నా అధికారులెవ్వరు కూడా ఇటువైపు రాలేదన్నారు. ఇంత పెద్దమొత్తంలో మొరం తవ్వకాలు జరుగుతున్నా సమాచారం లేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. అయితే అది ప్రభుత్వ భూమిగా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ఇంటి ముందు వేసుకునేందుకు ఓ ట్రాక్టర్ మొరం తెచ్చుకునేందుకు పలు రకాల నిబంధనలు పెట్టే అధికారులు.. ఈ విషయమై పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

ఎలాంటి అనుమతులివ్వలేదు

- తహసీల్దార్ షాహిదాబేగం

మొరం తరలింపునకు ఎవరికీ అనుమతులివ్వలేదు. ఆర్ఐని పంపించి విచారణ జరిపిస్తాం. ప్రభుత్వ భూమి అని తేలితే సంబంధీకులపై చర్యలు తీసుకుంటాం.

దారి కోసం పొలం హద్దుల తొలగింపు

మొరం తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు



కోకాపేట ఆశలు ఫలించేనా?

నియోపోలిస్ ప్లాట్ల వేలానికి హెచ్ఎండీఏ కసరత్తు

- ఎకరం వంద కోట్లు లక్ష్యంగా ధరల నిర్ధారణ
- హెచ్ఎండీఏ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి
- 24 ఎకరాల్లో..6 ప్లాట్లు

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : రెండేళ్ల కిందట బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన భూముల వేలం.. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఎకరం వంద కోట్ల రూపాయలకు విక్రయించి దేశీయ రియల్ ఎస్టేట్ పెట్టుబడులను ఆకర్షించగా.. ఇప్పుడు అదే ఆశతో కాంగ్రెస్ సర్కారు భూముల వేలానికి సిద్ధం అవుతున్నది. మార్కెట్ తిరోగమనంలో సాగుతున్నా.. భూములకు స్థానికంగా రేటు పెరగకపోయినా.. పెట్టుబడులకు ఆటంకాలు ఎదురౌతున్నా ఇలాంటి క్లిష్టమైన సమయంలో భూములను విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నది. గడిచిన రెండేళ్ల కాలంగా నగరంలో కుప్పకూలిన రియల్ ఎస్టేట్‌తో ప్రాజెక్టులను చేపట్టడమే గగనంగా మారడంతో.. ఉన్న భూములను విక్రయించి సొమ్ము చేసుకుని, మార్కెట్‌లో కదలిక వచ్చిందని చెప్పుకోవడమే లక్ష్యంగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో భూముల వేలానికి ప్రణాళికలు చేస్తున్నది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన కోకాపేట్ నియోపోలిస్ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగానికి గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. అంతకు ముందు నగరంలో భూములను హెచ్ఎండీఏ విక్రయించినా.. కోకాపేట భూములకు వచ్చినంత డిమాండ్ ఏ వెంచర్‌కూ రాలేదు. ఒక ఎకరం ఏకంగా రూ. వంద కోట్లకు విక్రయించి సిటీ మార్కెట్ స్థాయిని ఆకాశమెత్తుకు చేర్చింది. ఈ క్రమంలో ప్రభుత్వానికి భూముల వేలం ద్వారా భారీ స్థాయిలో నిధులు సమకూరడంతోపాటు, నగరంలో రియాల్టీలో పెను మార్పులు సంతరించుకున్నాయి. 2021, 2023లో రెండు దఫాలుగా 95 ఎకరాలు విక్రయించిన హెచ్ఎండీఏ దాదాపు రూ.3 వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చింది.

గంపెడు ఆశలు..

ఎకరం రూ.వంద కోట్లకు విక్రయించడంతో ప్రభుత్వానికి అంచనాలకు మించి ఆదాయం వచ్చింది. దీనికి తోడు అదనంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ స్వరూపాన్ని మార్చివేయగా.. అదే తరహాలో బుద్వేల్, మేడిపల్లి, వికారాబాద్ ప్రాంతాల్లోనూ భూములను విక్రయించే అవకాశం ఏర్పడింది. ఇప్పుడు ఇదే తరహాలో వెస్ట్ సిటీలోనే హాట్ కేకులాంటి కోకాపేట నియోపోలిస్ భూములకు వేలం నిర్వహించడం ద్వారా మార్కెట్‌లో కదలిక వస్తుందని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నది. గత వేలంలో వచ్చిన రెవెన్యూ తరహాలో ఇప్పుడు కూడా ఆదాయం వస్తుందని గంపెడాశలతో ఉన్న ప్రభుత్వానికి ఈ వేలం నిజంగానే లిట్మస్ పరీక్ష కానుంది. ప్రస్తుతం నియోపోలిస్‌లో 26 ఎకరాల 5-6 ప్లాట్లు అందుబాటులో ఉండగా.. ఒక్కో ఎకరానికి అప్‌సెట్ ధరను రూ.40-50 కోట్లుగా నిర్ధారించి.. వేలం నిర్వహించడంతో ఏకంగా రూ.1000-1500 కోట్లు ఆదాయమోస్తుందని భావిస్తున్నది. అనుకున్నట్లు జరిగితే... 26ఎకరాలకే గతంలో కంటే సగానికి పైగా ఆదాయం వచ్చినట్లేనని లెక్కలు వేస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం పెట్టుకున్న ఆశలకు మార్కెట్ ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

నిధులు వస్తేనే అభివృద్ధి పనులు

కోకాపేటతోపాటు హెచ్ఎండీఏ పరిధిలో వివిధ ప్రాంతాల్లో 1400 ప్లాట్లు వేలానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని విక్రయించడం ద్వారా హెచ్ఎండీఏ ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌తోపాటు, ప్రభుత్వం కలల ప్రాజెక్టులైన ఫోర్త్ సిటీ వంటి ప్రాజెక్టులను నిధులు సమకూర్చుకోవచ్చని భావిస్తోంది. దీంతో వేలం ద్వారా వచ్చే నిధులతోనే అభివృద్ధి పనులు చేపట్టే వీలు కలగనున్నది.

కాచిగూడ రైల్వే స్టేషన్‌కు లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయగా, సోమవారం రాత్రి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ కుమార్‌జైన్, హైదరాబాద్ రైల్వే డీఆర్ఎం లోకేశ్ విష్ణవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీశ్‌తో కలిసి ప్రారంభించారు.

నిధుల మంజూరుపై వివక్ష

- జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గానికి మాత్రమే నిధులు మంజూరు చేస్తూ మిగతా నియోజకవర్గాలపై సర్కారు చిన్నచూపు
- మన ఊరు-మన బడిలో పూర్తైన పనుల బిల్లులకు ఇంకా లభించని మోక్షం
- ఏడాదిన్నరగా పెండింగ్‌లో.. బిల్లుల కోసం ఎదురుచూపులు
- పెండింగ్‌లో రూ.10 కోట్ల చెల్లింపులు
- ప్రతి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్లు
- అయినా పట్టించుకోని ప్రభుత్వం, ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం కలెక్టరేట్ వద్ద రావాల్సిన బిల్లుల ప్రతులను చూపిస్తున్న కాంట్రాక్టర్లు

వికారాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పూర్తైన పనులకు సంబంధించి చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తైనప్పటికీ సర్కారు బడులను బాగు చేసేందుకు ఖర్చు చేసిన పైసలను కాంట్రాక్టర్లకు ఇంకా విడుదల చేయలేదు. గత ఏడాదిన్నరగా కలెక్టర్‌కు ప్రతి సోమవారం ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికీ ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న బిల్లులకు నిధులకు మోక్షం లభించలేదు. సర్కారు కేవలం కొడంగల్ నియోజకవర్గంపైనే ప్రేమ చూపిస్తూ వేల కోట్ల నిధులను విడుదల చేస్తూ జిల్లాలోని మిగతా నియోజకవర్గాలకు మొండిచెయ్యి చూపి స్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అమల్లోకి తీసుకువచ్చిన మన ఊరు-మన బడిలో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో ప్రస్తు సర్కారు వివక్ష చూపిస్తుండడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల క్రితం కొడంగల్ నియోజకవర్గంలో బిల్లులు విడుదల చేసిన ప్రభుత్వం.. వారికే అమ్మ ఆదర్శ పాఠశాల పనుల కాంట్రాక్ట్‌ను కూడా అప్పగించింది. మరోవైపు వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లు తమ భార్య పుస్తెలతాడు అమ్మి ప్రభుత్వ స్కూళ్లలో పనులు చేశామని కొందరు, చేసిన అప్పులకు మిత్తీలు కట్టలేకపోతున్నామని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మరోసారి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తైనా బిల్లులు రాకపోవడంతో వాటి కోసం కాంట్రాక్టర్లు గతేడాదిన్నరగా ఎదురుచూస్తున్నారు. స్కూల్ కమిటీలు, సంబంధిత అధికారుల ఒత్తిడితో పలు స్కూళ్లలో పనులు పూర్తి చేసిన చిన్నచిన్న కాంట్రాక్టర్లు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తి చేసిన వారిలో చాలా వరకు స్కూల్ కమిటీ సభ్యులే ఉండడం, అప్పులు చేసి పనులు పూర్తి చేసినట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్, ప్రజాభవన్, సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుండడంతో చెల్లింపుల ప్రక్రియ పెండింగ్‌లోనే కొనసాగుతున్నది. పనులకు సంబంధించి ఎంబీలు కూడా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేసినప్పటికీ సర్కారు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు త్వరలో నిధులు విడుదలవుతాయని దాటవేసే ధోరణిని అవలంబిస్తున్నారు. సర్కారు బడులను బాగు చేసేందుకు సొంత డబ్బులు ఖర్చుపెట్టి పనులు చేస్తే నిధులిచ్చేందుకు కక్ష సాధింపు చర్యలు చేయడంపై కాంట్రాక్టర్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా మొదటి విడతలో 371 స్కూళ్లను మన ఊరు-మన బడిలో భాగంగా ఎంపిక చేయగా, 20 స్కూళ్లలో పనులు పూర్తికాగా స్కూళ్లను కూడా గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 300 స్కూళ్లలో పనులు 20-50 శాతం మేర పనులు పూర్తయ్యాయి. సంబంధిత పనులకు సంబంధించి రూ.10 కోట్ల చెల్లింపులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

బస్సులు పెంచమంటే.. 24 శాతం నుంచి 50 శాతానికి పెంపు

బస్‌పాస్ ధరలు పెంచేశారు!

పెంచిన ధరతో ఆర్డినరీ బస్సుతో పాటు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో కూడా ఎక్కొచ్చని ఆర్టీసీ అధికారుల ఉచిత సలహా

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : తాంబూలం ఇచ్చేశాం తన్నుకు చావండి అన్న చందంగా ఆర్టీసీ అధికారుల తీరు ఉంది. వాస్తవ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న కష్టాలను అర్థం చేసుకోకుండా బస్‌పాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచేశారు. ఏకంగా 24 శాతం నుంచి 50 శాతం వరకు పెంచుతూ సామాన్య ప్రయాణికులపై కాంగ్రెస్ ప్రభుత్వం భారం వేసింది. రద్దీ అధికంగా ఉంటుందని ప్రయాణికులకు ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో బస్‌పాస్ ధరలు పెంచుతున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. రద్దీ అధికంగా ఉంటే బస్సుల సంఖ్య పెంచాల్సిందిపోయి ధరలు పెంచి మరో బస్సులో కూడా ప్రయాణించొచ్చని ఆర్టీసీ చిలకపలుకులు పలకడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాస్‌లను నమ్ముకొని విద్యాసంస్థలు, కార్యాలయాలకు చేరుకుంటున్న వారిని నట్టేట ముంచేలా బస్‌పాస్‌లపై 24 నుంచి 50 శాతం వరకు ధరలు పెంచింది. గ్రేటర్‌లో సుమారు 3.12 లక్షల బస్‌పాస్‌లున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, టూరిస్టులు, రోజువారీ ప్రయాణికులు ఆర్టీసీ బస్ పాస్‌లను తీసుకుంటారు. నెలవారీ, త్రైమాసిక పాస్‌లను పొందుతారు. ధరలను పెంచడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సు ప్రయాణాన్ని ప్రియం చేయడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

పెరిగిన బస్ పాస్ ధరలు..నెలవారీగా..!

పాస్	పాత ధర	ప్రస్తుతం (పెంచిన ధర)
స్టూడెంట్	400	600
ఆర్డినరీ	1150	1400
మెట్రో ఎక్స్‌ప్రెస్	1300	1600
మెట్రో డీలక్స్	1450	1800
గ్రీన్ మెట్రో లగ్జరీ	1900	2200

ఇదేం తరీఖా..?

విద్యార్థుల ప్రయాణం కారణంగా బస్సులు రద్దీని తలపిస్తున్నాయంట. అందుకే వారి బస్‌పాస్ ధరలను పెంచింది. పెంచిన ధరతో ఆర్డినరీ బస్సుతో పాటు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో కూడా ఎక్కొచ్చని ఉచిత సలహా ఇచ్చింది. కానీ మహాలక్ష్మి ఉచిత పథకం మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో కూడా వర్తిస్తుందని.. ఆ బస్సులన్నీ రద్దీని తలపిస్తున్న విషయం ఆర్టీసీ ఉన్నతాధికారులకు తెలియకపోవడం బాధాకరం. మహాలక్ష్మి ఉచిత పథకం నష్టాన్ని సర్కారు విద్యార్థులపై మోపిందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. మరో రెండు రోజుల్లో పాఠశాలలు, 20 రోజుల్లో కాలేజీలు ప్రారంభం కానున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల బస్‌పాస్‌లను సైతం పెంచడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నెలవారీ స్టూడెంట్ పాస్ రూ.400 ఉంటే ప్రస్తుతం 200 పెంచుతూ రూ.600 చేశారు. త్రైమాసిక పాస్ 1200 ఉంటే ఇప్పుడు 1800 అయింది. గ్రేటర్‌లో 1.50 లక్షల స్టూడెంట్ బస్‌పాస్‌లున్నాయి. నెలవారీ రూ.400 ధరతో రూ.6 కోట్లు ఆర్టీసీకి ఆదాయం వస్తున్నది. ఇప్పుడు పెరిగిన రూ.600తో 9 కోట్ల ఆదాయం వస్తున్నది. అదనంగా రూ.3 కోట్లు విద్యార్థులపై సర్కార్ భారం మోపడం బాధాకరమని రవాణారంగ నిపుణులు చెబుతున్నారు. సిటీ ఆర్డినరీ, మెట్రో డీలక్స్‌లో ఉచిత మహాలక్ష్మి పథకం కొనసాగుతున్నది. ఈ దృష్ట్యా ఆ బస్సులన్నీ రద్దీని తలపిస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు అదనంగా చేకూరే లాభం ఏమీ లేదంటూ విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. నిల్చొనే ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఉందంటూ తెలిపారు.

బస్సుల సంఖ్య పెంచండని..!

గ్రేటర్‌లో జనాభా కోటి మించింది. ఈ పరిస్థితిలో వారి రాకపోకలకు నగరంలో కనీసం 7వేల బస్సులు సమకూర్చాల్సిన అవసరం ఉందని ఇప్పటికే రవాణా రంగ నిపుణులు నివేదికలు ఇచ్చారు. కానీ ఇప్పటికీ బస్సుల సంఖ్య పెంచలేదు. ఆర్టీసీ నష్టాల కారణంగా బస్సుల సంఖ్య పెంచలేకపోతున్నామంటూ అధికారులు చెబుతున్నారు. గ్రేటర్‌లో 3100 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. 30వేల ట్రిప్పులు కొనసాగుతున్నాయి. మహాలక్ష్మి ఉచిత బస్సు స్కీం రాక ముందు గ్రేటర్‌లో ఒక్క రోజుకు 11 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేసేవారని అధికారులు చెబుతున్నారు. ఉచిత ప్రయాణం వచ్చాక ఒక్క రోజుకు 21 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. రెట్టింపు స్థాయిలో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులన్నీ రద్దీని తలపిస్తున్నాయి. దీంతో మధ్య స్టాపుల్లో ఉన్న ప్రయాణికులు బస్సు ఎక్కాలంటేనే నిల్చోవడానికి కూడా స్థలం దొరకని దుస్థితి నెలకొన్నది. దీంతో బస్సుల సంఖ్య పెంచి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రయాణికులు అధికారులను కోరుతూ అనేక వినతి పత్రాలు సమర్పించారు. లక్ష సంతకాల ఉద్యమం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు బస్సులు సమయానికి రావడం లేదనే ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి.